క్లుప్తంగా

ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన కార్యదర్శి



సావిత్రీనగర్ హార్బర్ వద్ద మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న మణికందన్

యానాం: నియోజకవర్గ శివారు సావిత్రీనగర్ ఫిషింగ్ హార్బర్‌ను శుక్రవారం పుదుచ్చేరి మత్స్యశాఖ కార్యదర్శి మణికందన్ సందర్శించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు, ఇతర అంశాలపై స్థానిక అధికారులతో సమీక్షించారు. స్థానికంగా ఉన్న సావిత్రీనగర్, గిరియాంపేట తదితర గ్రామాల మత్స్యకారులతో ఆయన వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిషింగ్ హార్బర్‌లోను, వేటకు వెళ్లే ప్రదేశాల్లోను మౌలిక సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏవో అంకిత్‌కుమార్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట పటిమ ఆదర్శనీయం



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: రజక సామాజిక వర్గ అభ్యున్నతికి అలనాడు భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు చేసిన చిట్యాల ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆ సామాజిక వర్గ పెద్దలు, నాయకులు పిలుపునిచ్చారు. ఐలమ్మ జయంతి సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అమలాపురం తాలూకా రజక సంఘం అధ్యక్షుడు పేట వెంకటేశ్వరరావు, బీసీ సెల్ నాయకుడు పలివెల శ్రీనివాస్ తదితరులు ప్రసంగిస్తూ, ఐలమ్మ చేసిన పోరాటాలను కొనియాడారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. తాలూకా రజక సంఘం కార్యదర్శి మోహనరావు, కోశాధికారి రమణ, బీసీ నాయకులు భాస్కర్ల రామకృష్ణ, మట్టపర్తి సాయిబాబు పాల్గొన్నారు.

'సూర్య ఘర్'పై అవగాహన పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రాజేశ్వరి

అమలాపురం రూరల్: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరి సూచించారు. అమలాపురంలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో సోలార్ పథకంపై బ్యాంకర్లు, వెండర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల తగ్గించుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలీ యోజన కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వరకు జిల్లాలో నిర్వహించనున్నట్లు 'తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీన కలెక్టరేట్ నుంచి అమలాపురంలోని గడియారస్తంభం కూడలి వరకు పీఎం సూర్యఘర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు.సమావేశంలో ఎల్‌డీఎం కేశవ వర్మ, ఈఈ రాంబాబు, విజయనాద్, ఏఈలు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌రావుకు సత్కారం



డాక్టర్ ప్రభాకర్‌రావును సత్కరిస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: పేరూరు గ్రామ పరిధిలో శుక్రవారం నిర్వహించిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్‌రావును పేరూరు పీహెచ్‌సీ వైద్యఅధికారి రాహుల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డాక్టర్ ప్రభాకర్‌రావుకు శాలువా కప్పి, పూలమాలువేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ కామేశ్వరరావు, సీహెచ్ఓ రోజా, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఓ భక్తుడు విరాళం అందించారు. మచిలీపట్టణానికి చెందిన టి. పున్నయ్య దంపతులు రూ.20,116 ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించారు. దాతలకు శేష వస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దాతను సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ అభినందించారు.

రేకుల షెడ్డులోనే బడి పాఠాలు

- పాత భవనాల కూల్చివేత
- దాతల సాయంతో నిర్మించిన చిన్న షెడ్డులోనే తరగతులు
- వైఎస్సార్ సీపీ హయాంలో నిధుల కేటాయింపు
- పి.లక్ష్మీవాడ పాఠశాల అభివృద్ధిని పట్టించుకోని కూటమి



పి.లక్ష్మీవాడలో దాతల సాయంతో నిర్మించిన రేకుల షెడ్డులోనే ప్రాథమిక పాఠశాల తరగతి గది

కాట్రేనికోన: పాఠశాల భవనాలు లేక విద్యార్థులు దాతల ఆర్థిక సహాయంతో నిర్మించిన చిన్నపాటి రేకుల షెడ్డు, చెట్టు నీడలో ఆరు బయటనే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరు గున్నేపల్లి, పి.లక్ష్మీవాడ, కుండలేశ్వరం తనేలుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనాలు లేక సుమారు 15 ఏళ్లుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శిథిల భవనాల తొలగింపు

పాఠశాల భవనాలు శిథిలం కావడంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన మండల పరిషత్ అధికారులు వాటిని తొలగించారు. కొంతకాలం పాటు చెట్టు నీడన, ఆరు బయట పాఠాలను చెబుతూ టీచర్లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాట్రేనికోన మండలంలోని పి.లక్ష్మీవాడలో శిథిలమైన ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీ భవన శిథిలం కావడంతో మండల పరిషత్ అధికారులు వాటిని తొలగించారు.

సమస్యపై స్పందించిన పొన్నాడ

వైఎస్సార్ సీపీ హయాంలో కుండలేశ్వరంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి హాజరైన అప్పటి ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అడ్డుకుని పాఠశాలకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. నిలువ నీడ లేదని, ఆరుబయట చెట్ల నీడలో విద్యార్థులు చదువుకోవలసి వస్తోందని, వర్షం కురిస్తే నీరు దిగే మార్గం లేదని వాపోయారు. సమస్యపై స్పందించిన పొన్నాడ తనేలుపేట పాఠశాలకు భవన నిర్మాణానికి విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తక్షణం పనులు చేపట్టాలని ఆదేశించారు. తాత్కాలికంగా విద్యార్థుల కోసం స్థానిక నాయకులతో రేకుల షెడ్డు నిర్మాణానికి ఆయన కృషి చేశారు.

మూడు పాఠశాలలకు రూ.48 లక్షల నిధుల మంజూరు

కుండలేశ్వరం తనేలుపేట, పి.లక్ష్మీవాడ, చెయ్యేరు గున్నేపల్లి పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని అప్పటి కలెక్టరు హిమాన్షు శుక్లా దృష్టికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తీసుకెళ్లారు. మూడు పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.16 లక్షల చొప్పున మొత్తం రూ.48 లక్షలు నిధులు కేటాయించాలని గనుల శాఖ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) అధికారులను ఆయన ఆదేశించారు. దీనిపై కలెక్టరు ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత శాఖ నిధులు కేటాయించింది. చెయ్యేరు గున్నేపల్లి, పి.లక్ష్మీవాడ పాఠశాల భవనాల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చెయ్యేరు గున్నేపల్లిలో పనులు చేపట్టారు. పి.లక్ష్మీవాడ పాఠశాల భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పాఠశాల భవనం పనులతో పాటు కమ్యూనిటీ భవనం పనులు కూడా చేపట్టాలని ఒక సామాజిక వర్గం ధర్నా చేపట్టి అడ్డుకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి పాఠశాల భవనం నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో దాతల సహకారంతో వేసిన రేకులు షెడ్డులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా ఈ పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంబంధిత పాఠశాలలకు నూతన భవనం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పాఠశాల భవనం పనులు చేపట్టండి



పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో దాతలు నిర్మించిన రేకుల షెడ్డు, ఆరుబయటనే విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. కనీస వసతులు మాట ఎలా ఉన్నా పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పినిపే ఆనంద్, స్కూల్ కమిటీ చైర్మన్, ఎంపీపీ స్కూల్ పి.లక్ష్మీవాడ

వర్షానికి తడిసి ముద్దవుతున్నారు



వేసవి, శీతాకాలాల్లో ఆరు బయటనే, చెట్ల నీడలో పాఠాలు చెబుతున్నారు. వర్షం కురిస్తే నిలువ నీడ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేకుల షెడ్డులోకి వర్షపు జల్లు రావడంతో చిన్నారులు తడిసి ముద్దవుతున్నారు.

– గెద్దాడ నాగ వెంకటేశ్వరరావు, పేరెంట్, ఎంపీపీ స్కూల్, పి.లక్ష్మీవాడ

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తాం



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను ఆయన అభినందించారు. శాసన మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించారని ఇజ్రాయిల్ తెలిపారు. వైస్ జగన్ ఆదేశాలతో ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తామని ఇజ్రాయిల్ అన్నారు.

దీపావళికి నిత్యావసరాల కిట్

యానాం: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వం అన్ని రేషన్‌కార్డులకు 5 రకాల నిత్యావసరాల వస్తువుల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు శుక్రవారం సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు తెలిపారు. రేషన్‌షాపుల ద్వారా అందించే ఈ కిట్టులో 2 కిలోల పంచదార, 2 కిలోల సన్‌ఫ్లవర్ నూనె, కిలో శెనగపప్పు, 500 గ్రాముల రవ్వ, 500 గ్రాముల మైదా చొప్పున అందించ నున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న మొత్తం 15,460 మంది రేషన్‌కార్డు దారులు లబ్ధిపొందనున్నారని తెలిపారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

బాలకృష్ణ నైజం బయటపడింది

అమలాపురం టౌన్: సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలతో ఆయన నిజమైన నైజం అంటే సైకోయిజం బయట పడిందని వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ నాయకుడు వంటిద్దు వెంకన్నాయుడు అన్నారు. స్థానిక వంటిద్దు వీధిలో ఆయన శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ బాలకృష్ణ చేసిన అసందర్భ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా సినీ నటుడు చిరంజీవి లేఖ ద్వారా ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆ రోజు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సినీ దిగ్గజాలకు ఎంత గౌరవం ఇచ్చారో చెప్పారన్నారు. చిరంజీవి ముందుకు వచ్చి వాస్తవం చెప్పడం అభినందనీయమన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలు ఆయన అహంభావానికి, అవివేకానికి అద్దం పడతాయని విమర్శించారు. బాలకృష్ణ అప్పట్లో మానసిక స్థితి బాగోక తాను తీసుకున్న సర్టిఫికెట్టే ఆయన సైకో అని రాష్ట్ర ప్రజలకు ఆనాడే తెలిసేలా చేసిందని చెప్పారు.

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తు సేవల పన్ను తగ్గింపు జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దసరా నుంచి దీపావళి వరకు నెలరోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కార్యక్రమాలను దీపావళి ముందు రోజైన అక్టోబరు 19వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ నిషాంతి, డీఆర్వో కె. మాధవి పాల్గొన్నారు.

డ్రోన్లతో నానో యూరియా పిచికారీ

500 ఎకరాల్లో నానో యూరియా పిచికారీ చేసేందుకు వోమిక్ డ్రోన్ కంపెనీ సహకారం తీసుకున్నామని తెలిపారు. కోనసీమ పరిధిలో 50 నుంచి 70 డ్రోన్లు, పైలెట్లతో సహా రోజుకు 500 ఎకరాల్లో నానో యూరియా పిచికారీ చేసేందుకు వోమిక్ డ్రోన్ సహకారం అందించేందుకు కంపెనీ చెందిన ప్రతినిధి హేమంత్ మాదిరెడ్డి ముందుకు వచ్చారని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో 100 మంది సచివాలయ వ్యవసాయ సహాయకులకు డ్రోన్ ఆపరేషన్ పై ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కోరంగి అభయారణ్యం సందర్శన



కోరంగి అభయారణ్యాన్ని సందర్శిస్తున్న విద్యార్థినులు

యానాం: జీవ వైవిధ్యానికి ప్రసిద్ధిచెందిన కోరంగి అభయారణ్యాన్ని శుక్రవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ, బోటనీ విద్యార్థినులు సందర్శించారు. కాకినాడలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్‌ను సైతం సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు డాక్టర్ జీవీ సుధాకర్ మాట్లాడుతూ, ఆసియా ఖండంలోనే కోరంగి మడ అడవులు రెండో స్థానాన్ని ఆక్రమిస్తున్నాయని చెప్పారు. వివిధ జీవజాతులకు నిలయంగా మారిందన్నారు. అనంతరం కాకినాడ మత్స్య పరిశోధన కేంద్రంలో సీనియర్ సైంటిస్ట్ కె శ్యామల, సెంటర్ హెడ్ మురళీధర్ బ్రాకిష్ వాటర్, ఆక్వా కల్చర్ తదితర అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతికుమార్ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీ



జి.వేమవరంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించిన కోరంగి ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: బాణసంచా తయారీ కేంద్రాల్లో కోరంగి పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని జి.వేమవరంలో నిర్వహిస్తున్న మందుగుండు సామగ్రి తయారీ కేంద్రంపై కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తయారీ కేంద్రానికి అనుమతులు ఉన్నాయా, నిబంధనలు పాటిస్తున్నారా అన్నదానిపై అధ్యయనం చేవారు. దీపావళి పండుగ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ అభివృద్ధి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లరేవు: ప్రధాన మంత్రి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం ఉప్పంగల పంచాయతీలో నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ శాకా శంకరుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు లావణ్య నేతృత్వంలోని బృందం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతులైనపుడే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ



డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ మంగాయమ్మ దంపతులు

అల్లవరం: ఓడలరేవు టెర్మినల్ పాడవునా పాత డ్రెయిన్ స్థానంలో కొత్తది నిర్మించేందుకు ఓఎన్‌జీసీ సీఎస్సార్ నిధులు రూ.3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ తెలిపారు. శుక్రవారం నూతన డ్రెయిన్ నిర్మాణానికి పాత గేటు వద్ద సర్పంచ్ భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ టెర్మినల్ విస్తరణ అనంతరం గ్రామంలో ముంపు నీరు భారీగా స్తంభించి, కొబ్బరితోటలు పాడై రైతులు తీవ్రంగా నష్ట పోవడమే కాకుండా, పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. డ్రెయిన్ నిర్మాణానికి రూ.5.83 కోట్ల నిధులతో ప్రతిపాదనలు చేయగా, తొలి విడతగా రూ.3.5 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. డ్రెయిన్ నిర్మాణంతో గ్రామంలో ముంపు సమస్య తీరుతుందన్నారు.

ఆర్‌టీఎఫ్ బకాయిలు విడుదల చేయాలి

అల్లవరం: డిగ్రీ కాలేజీలకు ప్రభుత్వం విడుదల చేయాల్సిన రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్) బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. అల్లవరం రవితేజ కాలేజీలోని డిగ్రీకి చెందిన విద్యార్థులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతేడాది నుంచి ద్వితీయ, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఆర్‌టీఎఫ్ నిధులు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను విడుదల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నులు

ముమ్మిడివరం: ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరం డా.బహదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం ర్యాలీ ,ధర్నా నిర్వహించారు. కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహంచారు. కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

హార్టికల్చర్ ప్రగతిపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ డి.రాంబాబు

ఐ.పోలవరం: మండలంలో కొమరగిరి పంచాయతీలో శుక్రవారం హార్టికల్చర్, కంపోస్ట్ పిట్‌లను ఏపీడీ డి.రాంబాబు, పొంటేషన్ మేనేజర్ త్రినాథ్ తదితరులు పరిశీలించారు. మురమళ్ల గ్రామ సచివాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, ఎంసీసీ సిబ్బందితో కంపోస్ట్ పిట్స్ ,హార్టికల్చర్, కేటిల్ షెడ్ నిర్మాణం పనుల ప్రగతి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఒ వి.నాగేంద్ర, టీఏలు కె.శ్రీనివాస్, కె.మహేష్, ఫీల్డ్ అసిసెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఆలమూరు: ప్రపంచాన్ని పట్టి పీడిస్తూ అనేక మంది మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా మహిళలందరూ అవగాహన పెంచుకోవాలని స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుమలత అన్నారు. మండలంలోని చెముడులంకలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో ఆమె పాల్గొన్నారు. ఆహార శైలిలో మార్పుల ద్వారా క్యాన్సర్‌ను నిర్మూలిచవచ్చన్నారు. రాష్ట్రంలో ఏటా 70 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, 40 వేల మంది వరకూ మృతి చెందుతున్నారన్నారు. జిల్లాలో సుమారు మూడు వేల మంది క్యాన్సర్ బాధితులున్నట్లు తెలుస్తోందన్నారు. కాకినాడ జీజీహెచ్ లో వ్యాధి నిర్ధారణకు పీఓయూ 222 గ్రీన్ చానల్ ఓపీ విభాగం మంగళ, గురువారాల్లో అందుబాటులో ఉంటుందన్నారు.

శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవార్ల దర్శనం



అమలాపురంలో మహాలక్ష్మీదేవిగా శ్రీదేవి అమ్మవారు



మహాలక్ష్మీదేవి అలంకరణలో సావరం కనకదుర్గమ్మ



సన్నవిల్లిలో దుర్గమ్మకు రూ.1.25 లక్షల కరెన్సీతో అలంకరణ



చినకొత్తలంకలో రూ.1.75 లక్షలతో అలంకరణ

అమలాపురం టౌన్: విజయ దశమి శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా అయిదో రోజు శుక్రవారం అమలాపురంలోని అమ్మవార్ల ఆలయాల్లో దుర్గమ్మ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను ఆలయ కమిటీలు కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవీగా అలంకరించారు. స్థానిక శ్రీదేవి మార్కెట్ సెంటరులోని శ్రీదేవి ఆలయం, మెయిన్ రోడ్డులోని వాసవీ మాత ఆలయం, సావరం బైపాస్ రోడ్డులోని కనకదుర్గ ఆలయం, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని వైష్ణవీ కనక దుర్గ ఆలయం, నల్లా వీధిలోని విజయదుర్గ ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయం, గోల్డ్ మార్కెట్‌లోని శ్రీకామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ కమిటీలు తమ తమ ఆలయాల్లో అమ్మవార్లను కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు.

ఘనంగా శరన్నవరాత్ర వేడుకలు

తాళ్లరేవు: మండల పరిధిలోని దుర్గా ఆలయాలు, మంటపాలలో శరన్నవరాత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేసారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలో పరదేశమ్మ వీధిలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేసారు. పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో యానాం-గిరియాంపేట రహదారి చెంతన దుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. చినబొడ్డు వెంకటాయపాలెం జాడ వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

ఉప్పలగుప్తం: సన్నవిల్లి గ్రామంలో అమ్మవారిని రూ.1.25 లక్షల విలువైన కరెన్సీతో అలంకరించారు. మహాలక్ష్మీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు

భువనేశ్వరిదేవికి బంగారు పుష్పాలతో మహిళలు పూజలు

అమలాపురం రూరల్: చిందాడగరువులో కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. పాత బండారులంకలో భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భువనేశ్వరి అమ్మ వారికి 108 బంగారు పుష్పాలతో మహిళలు పూజలు చేశారు. శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి చంద్రకళ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: చినకొత్తలంకలో అమ్మవారిని రూ.1.75 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆయా అమ్మ వార్లను భక్తులు విశేషంగా దర్శించి ప్రత్యేక పూజలు చేయించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.